# 15. అహా! రహదారులు!!

వెనకటికి ఎప్పుడో ఒక జోక్!. ఒక పత్రిక సంపాదకుడి దగ్గరికి ఒక ఔత్సాహిక రచయిత తన రచన ఒకటి తీసుకెళ్ళి ప్రచురించమని అడిగాడు.

"సారీ, మేం మంచి పేరున్న రచయితలవే తప్ప, మరో రకం రచయితలవి వేసుకోం" అన్నాడట సంపాదకుడు.

"నా పేరు చక్రవర్తుల శశికాంత సుధామోహన్. ఇంత కంటే మంచి పేరున్నవాడు మీకెవడు దొరుకుతాడు?" అన్నాడట ఆ ఔత్సాహిక రచయిత.

రోడ్లు, భవనాల శాఖలో ఇంజినీరుగా పనిచేస్తున్న ఆవుపాల చంద్రచూడ శాస్త్రి అనే నా ఫ్రెండు సంగతి ఇంచుమించు ఇలాగే జరగడం కేవలం కాకతాళీయం కాదు.

శాస్త్రి సాహిత్య పిపాసి కాదు. అతను నేనూ కలిసి ఎల్.సి.ఇ. చదివిన రోజుల్లో నేను ఇంజినీరింగ్‌తో పాటు కావ్యాలు, పురాణాల నుంచి ఆధునిక కవిత్వం, నవలలూ, కథలూ, సాహిత్య వ్యాసాలూ చదువుతూ వుంటే "ఎందుకురా ఇవన్నీ చదివి పాడైపోతావు? మన దృష్టి అంతా ఇప్పుడు డిప్లొమా మీద ఉండాలి. డిప్లొమా చేతికొచ్చి ఉద్యోగం వచ్చేక ఎ.ఎం.ఐ.ఇ.కి వెళ్లి డిగ్రీ సంపాదించుకొని కనీసం అసిస్టెంట్ ఇంజినీరైనా అయ్యాక అప్పుడు నీ ఇష్టమొచ్చిన నాటకాలు ఆడొచ్చు" అని చాలాసార్లు మందలించాడు. అయితే వేమన్న గారు స్త్రీ వ్యసనం గురించి చెప్పినట్టు సాహిత్య వ్యసనపు బాధ కూడా అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది కదా. పైగా మా చంద్రచూడ శాస్త్రి పదకొండో క్లాసు చదివి పాసైన వెంటనే ఎల్.సి.ఇ.లో చేరాడు. నేను బి.ఏ. దాకా చదివి ఎల్.సి.ఇ.కి వచ్చాను. బి.ఏ.కి ఆ రోజుల్లో ఇంగ్లీషులో పదమూడు టెక్స్ట్‌లు, మూడు పేపర్లు; ఉండేవి. దానా దీనా సాహిత్యంతో పరిచయం అయి, అందులో కిక్కు నా తలకెక్కింది.

అనుకున్నట్టుగానే శాస్త్రి నేనింకా ఓవర్‌సీరుగా ఉండగానే అసిస్టెంట్ ఇంజినీరుగా ఉద్యోగం సంపాదించేసేడు. ఇదుగో, అభినందనలు అని రాద్దాం అనుకుంటూ ఉండగానే అతని పేరు ఒక వారపత్రిక లో చూసి ఆశ్చర్యపడ్డాను. "టెండర్లు నామమాత్రం" అని టైటిలు పెట్టి ఒక కథ రాసేడు శాస్త్రి. చదివాను. ఇంజినీరుగా పనిచేస్తున్న వ్యక్తికి టెండర్లు, డిపోజిట్లు, ఎస్టిమేట్లు, ఎస్కలేషన్లు, బిల్సు - ఇలాంటి వివరాలు వాట్లో లోతుపాతులు బాగా తెలుస్తాయి కదా. అందుకని కథ చాలా కరెక్టుగా వచ్చింది.

"నేనసలు ఎ.సి.శాస్త్రి అనే పేరుతో ప్రచురించమన్నాను. కాని ఆ ఎడిటర్ గారు నా పేరు చాలా బావుందని, విలక్షణంగా ఉందని అభిప్రాయపడి ఆవుపాల చంద్రచూడ శాస్త్రి అని అచ్చువేసేరు" అని చెప్పేడు శాస్త్రి ఆ తర్వాత నేను అతన్ని కలిసినపుడు.

"ఇంకా ఏమిటి విశేషాలు? రాయడమేనా, లేకపోతే ఏమన్నా పాత క్లాసిక్కు చదువు

తున్నావా?'' అన్నాను.

"పాత క్లాసిక్సా? అవేమిటవి?'' అన్నాడు శాస్త్రి.

"షార్టు స్టోరీ అనే ప్రక్రియ మనకి పాశ్చాత్యుల ద్వారా పట్టుబడింది. అయితే మన భారతీయుల్లో కూడా పాశ్చాత్యుల్ని ఓహో అనిపించ గల కథలు రాసిన వాళ్లున్నారు. అంచేత ఓల్డ్‌మాస్టర్స్ రాసినవి చదివితే ఆ రంగంలో నీకు పునాది దిట్టపడుతుంది. ఎలాగా రంగంలో దిగావు గనక చెకోవ్, మపాసా, ఓ హెన్రీ లాంటి రచయితల కథలూ, ప్రేమ్‌చంద్, టాగూర్, అబ్బాస్, కుటుంబరావు, బుచ్చిబాబు, పద్మరాజు, రావిశాస్త్రి, చాసో లాంటి రచయితలవీ చదువు'' అని వివరించాను.

"ఇప్పుడవన్నీ యెవడు చదువుతాడు? ఇటు ఉద్యోగం అటు సంసారం చేసుకుంటూ రోజూ ఒక న్యూస్ పేపరు చదవడానికే ఖాళీ ఉండడం లేదు. పైగా రాయడం మొదలెట్టేను కదా. దానికోసం నోట్సు, సంఘటనలు, కథా అన్నీ పేర్చుకోవాలి కదా''

"ఇప్పుడేమిటి రాస్తున్నావు?'' అన్నాను.

"ఒక నవల రాస్తున్నాను. ఎడిటర్ గారే చెప్పేరు. కథలు ఎన్ని రాసినా పేరు రాదు, డబ్బు రాదు. అంచేత ఈ పరిశీలనా శక్తితో నవల రాస్తే పేలుతుంది అని. ఒక వారం రోజుల్లో పూర్తి చేస్తాను.''

"నువ్వు నీ నవల ఎడిటర్ గారికి పంపించే ముందు నన్నొకసారి చదవనిస్తావా?'' అన్నాను కుతూహలంగా.

"నేనూ సరిగ్గా అదే అనుకుంటున్నాను. నువ్వు నా బాల్య మిత్రుడివే కాకుండా నాతో పాటుగా ఇంజినీరింగ్ వృత్తిలో ఉన్నావు. అంతేకాక సాహిత్యం గురించి బాగా తెలుసుకున్నావు. అంచేత నా నవలకి మొట్టమొదటి పాఠకుడుగా నిన్ను ఎంచుకోవడం ఎప్పుడో అయింది.''

ఆ తర్వాత పది రోజులకి ఆవుపాల చంద్ర చూడశాస్త్రి నేనింట్లో లేనప్పుడొచ్చి మా ఇంట్లో తన నవల ఇచ్చేడు. ఆ రాత్రి, మరుసటి రోజు (ఆదివారం), మళ్లీ ఆ రాత్రి చదివేసి సోమవారం నా అభిప్రాయం చెప్పమని, సోమవారం సాయంకాలం వస్తానని చీటిరాసేడు.

శాస్త్రి తన నవలకి "అహ! రహదారులు!!'' అని పేరు పెట్టేడు. చూడగానే అహరహం అంటే రాత్రీ పగలూ మనకి అవసరమయ్యే రహదారుల గురించి రాసేడని గ్రహించాను. నాలుగు వందల పేజీలుంది. శ్రద్ధగా చదవడం కొంచెం శ్రమతో కూడినపనే. కాని ఏం చెయ్యను? అతను నా అభిప్రాయం కోసం సోమవారం వచ్చేస్తాడు. చదివి తీరవలసిందే.

రోడ్లు ఎన్ని రకాలు. అవి ఏవి. అసలు రోడ్లు వెయ్యాలని అశోకుడి కన్నా ముందుగా ఎవరైనా సంకల్పించేరా. ఏ దేశంలో రోడ్లు ఎలా ఎలా నిర్మిస్తారు. కంకర, మట్టి, తారు, సిమెంటు, రబ్బరు ఏవి-ఎక్కడ-ఏ పరిస్థితులకి అనుగుణంగా-రోడ్ల కోసం వాడాలి. మెటీరియల్స్ ఎక్కడెక్కడ దొరుకుతాయి, కాంట్రాక్టులు ఎలా ఇస్తారు. రోడ్డురోలర్లు, డంపర్లు, రోడ్లు క్లీన్ చేసే యంత్రాలు వీటి పుట్టు పూర్వోత్తరాలేమిటి, ఎస్టిమేట్లు ఎలా వేస్తారు. కంట్రాక్టర్లు, ఇంజినీర్లు కలిసి రోడ్ల నిర్మాణంలో ఎలాటెలాంటి పాపభూయిష్ఠమైన చర్యలకు దిగి ప్రభుత్వాల్నీ ప్రజల్నీ ఎలా యెలా

మోసం చేస్తారు. ఒకటేమిటి 'అహా! రహదారులు!!' అని గుండె చరుచుకోవడానికి తగినన్ని వివరాలు గొప్ప సాంకేతిక పరిణతితో సేకరించి, వాటి వివరణ మధ్య ఎలాగో మిణుకు మిణుకుమంటూ ఉందా లేదా అనిపించే ఒక కథ అల్లి నాలుగు వందల యాభై పేజీలు రాసేడు. చదివి చాలా థ్రిల్లయిపోయిన మాట నిజం.

"చదివావా?" అని అడిగాడు, సోమవారం సాయంకాలం ఠంచనుగా వొచ్చి ఆవుపాల చంద్రచూడ శాస్త్రి.

"ఆ" అన్నాను నిర్లిప్తంగా.

"మరి, నీ అభిప్రాయమేమిటి?"

"చాలా బాగా రాసేవు."

"అలాక్కాదు. నీకా నవల ఎక్కడ బావుంది, ఎలా బావుంది, వివరంగా చెప్తావని కదా, నీకది చదవమని ఇస్త."

"నవల ఏ ఒక్కచోటా బాగులేదు. మొత్తంగా బావుంది." అన్నాను.

"అసందర్భంగా మాట్లాడకు. ఏ ఒక్కచోటా బాగుండనిది మొత్తంగా ఎలా బావుంటుంది?" అని గట్టిగా అడిగాడు శాస్త్రి.

"నేను వాఙ్మయం నుంచీ, సాహిత్యం నుంచీ చాలా చదివేను. వాక్యం రసాత్మకం కావ్యం అన్నారెవరో, అలాగ ఒక డోరియన్ గ్రే చదివినప్పుడో, ఒక చివరకు మిగిలేది చదివినప్పుడో ఔట్ సైడర్, అన్నాకెరినినా, మాబీడిక్, వేయి పడగలు, మూడు కథల బంగారం, చంద్రునికో నూలు పోగు- ఇలాంటి నవలలు చదివినపుడో ఆ రసాత్మకమైన వాక్యాల్ని మళ్లీ చదివేను. అలాంటి రసాత్మకమైన వాక్యం ఒక్కటి కూడా నీ నవలలో లేదు. అయితే నీ కృషి అమోఘం. నీ సమాచార సేకరణా సామర్ధ్యం అనితర సాధ్యం, రోడ్లు, వాటి నిర్మాణము, సాధకబాధకాలు- అని టైటిలు పెట్టి నువ్వు ఒక టెక్స్ట్ బుక్ రాస్తే దానికి ఆధికారికత రాదు. కథంటూ ఒకటి పెట్టి సస్పెన్సు కాపాడుకుంటూ రాసేవు కనక నీ పుస్తకం అందరూ చదువుతారు. నువ్వు రచయితగా స్థిరపడతావు, డబ్బు చేసుకుంటావు" అన్నాను.

"అంటే?" అని కుర్చీలో వెనక్కి చారబడ్డాడు శాస్త్రి.

"సమాచార దర్శినులైన నవలలు, అన్నిరకాల నవలల్లాగే పాశ్చాత్య దేశాల నుంచి మనకి దిగుమతి అయి ఒక కొత్త సంప్రదాయాన్ని సృష్టించాయి. రోడ్ల నిర్మాణం గురించో, టెలిఫోన్లు పనిచేసే తీరును గురించో, విమానాశ్రయం, ఆస్పత్రి, హోటలు, కేన్సరు జబ్బు మొదలైన విషయాలను గురించో చదవగోరే వారు సాహిత్య పిపాసులు కానక్కర్లేదు. మానవ సంబంధమైన రాగద్వేషాల స్వరూపాలు అవగాహన చేసుకోగోరే వారే సాహిత్య పాఠకులు. నీలాంటి వాళ్లు సమాచారమే సాహిత్యం అని వాళ్ళమీద రుద్దుతున్నారు. సాగనీ. ఇది కూడా కొన్నాళ్లు సాగుతుంది." అని చెప్పేను.

అదిగో, ఆరోజు నుంచే శాస్త్రి నాతో మాట్లాడ్డం మానేశాడు.

★